సాక్షి తిరుపతి

శనివారం । 4 । నవంబర్ । 2023



ఆనందం 'హక్కు'

శెట్టిపల్లె వాసుల దశాబ్దాల కల నెరవేరింది. వారి భూములు, స్థలాలపై హక్కు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - IVలో



అవినీతికి 'కాజ్‌వే'

కేవీబీపురం మండలంలోని కాళంగి వాగుపై కాజ్ వే మరమ్మతుల్లో టీడీపీ నేతలు చేతివాటం ప్రదర్శించారు. - IIలో



కిసాన్ రుణం 'అమూల్'యం

పశు కిసాన్ క్రెడిట్ కార్డులపై ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. ఈ మేరకు పాడి రైతులకు అండగా నిలుస్తోంది. - IVలో

న్యూస్‌రీల్

పుష్కలంగా భూగర్భ జలాలు



నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్

తిరుపతి అర్బన్ : వర్షాలు తక్కువగా కురిసినా జిల్లాలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని భూగర్భజలవనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వరావు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్–నవంబర్‌కు సంబంధించి గత ఏడాది 617.74 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ ఏడాది 405.30 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసిందన్నారు. గతే ఏడాది 27శాతం భూగర్భ నీటిని వినియోగించు కోగా 73శాతం మిగులు ఉందని చెప్పారు. అయితే ఈ ఏడాది 28శాతం నీటిని ఇప్పటి వరకు వినియోగించామని చెప్పారు. 72శాతం మిగులు ఉందని స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే పాకాలలో కేవలం 1.91 మీటర్లలో నీటినిల్వలు ఉంటే శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరులో అతి ఎక్కువగా 23.73 మీటర్లలోతులో నీటి నిల్వలు ఉన్నట్లు గుర్తించామని వివరించారు. చిన్నపాటి వర్షాలు వస్తే నీటి మట్టం భారీగా పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ నెల 30వ తేదీకి నీటి నిల్వల తుది జాబితాను తయారు చేయనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో జేఎన్‌టీయూ అంతర విశ్వవిద్యాలయాల ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు శుక్రవారం క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఎస్వీసీఈ కళాశాలకు చెందిన శ్రీరోహిత్, మోన్విత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రక్రియలో చిత్తూరు జిల్లా ఆర్చరీ కోచ్ టి.ధనంజయులు, కార్యదర్శి పీవీ రమణ, జేఎన్‌టీయూ క్రీడామండలి కార్యదర్శి జోజి రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకరరెడ్డి, కళాశాల పీడీలు కిషోర్‌నాయక్, పి.చెన్నయ్య, పార్వతి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,335 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,271 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.29 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనమవుతోంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైయినట్లు ప్రధానోపాధ్యాయని రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎంపికై న విద్యార్థులు గుంటూరు జిల్లా తాడికొండ మండలం కనలేరులో నిర్వహించే స్టేట్ లెవల్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనేందుకు పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీలు వెంకటముని, ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనకు ప్రత్యేక క్యాంపులు



నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, తిరుపతి

తిరుపతి అర్బన్ : ఓటరు జాబితా పరిశీలనకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో జాబితాలను అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం, ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని మొత్తం 395 పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు 3,00,940 మంది ఓటర్లు , 410 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని వివరించారు. ఓటర్లు తప్పనిసరి జాబితా సరిచుసుకోవాలని, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

గంగపుత్రులకు అభయం



• వాకాడు మండలం ఓడపాళెం గ్రామానికి చెందిన ఈ మత్స్యకారుడి పేరు మునస్వామి. వయసు 49 ఏళ్లు. సొంత ఊర్లో జీవనం కష్టంగా మారడంతో గత పదిహేను ఏళ్లుగా తన స్నేహితులతో కలసి తమిళనాడు ప్రాంతంలోని హార్బర్లు వద్ద వలస కూలీగా పనిచేస్తున్నాడు. తమిళనాడు మత్స్యకారులతో కలసి బోటును అద్దెకు తీసుకుని వేటకు వెళ్లవాడు. అయితే ఒక్కోసారి వారం పది రోజులపాటు సముద్రంలో వేట సాగించినా తమిళ జాలర్లు కనీస కూలీ డబ్బులు కూడా ఇవ్వకుండా మోసం చేసేవారు. ఆ సమయంలో ఎన్నో పర్యాయాలు పస్తులతో అలమటించాడు. జగనన్న ప్రభుత్వం రావడంతో మునస్వామి గత నాలుగేళ్లుగా సొంత ఊర్లోనే వేట సాగిస్తూ సుఖంగా జీవిస్తున్నాడు.



• ఇతడి పేరు చిన్ని వెంకటేశ్వర్లు. వాకాడు మండలం లైట్‌హౌస్ గ్రామం. గత పదేళ్లుగా స్థానికంగా పనిలేక పోవడంతో తమిళనాడు కూత్తుకుడి ప్రాంతానికి వలస కూలీగా వెళ్లాడు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. ఓసారి సముద్రంపై వేట సాగిస్తున్నప్పుడు తుపాను వచ్చింది. అప్పట్లో తనతోపాటు సముద్రంలో చిక్కుకున్న ఐదుగురు మత్స్యకారులను కాపాడాడు. ఎంతో సాహసంతో బోటును 15 నాటికల్ మైళ్లు చాకచక్యంగా నడిపి ఒడ్డుకు సురక్షితంగా చేర్చాడు. ఆ సమయంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఎంతో ఆందోళన చెందారు. ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న మత్స్యకార సంక్షేమ పథకాలతో మూడున్నరేళ్లగా లైట్‌హౌస్ ప్రాంతంలోనే వేట చేసుకుంటూ జీవిస్తున్నాడు.



• ఈ ఫొటోలో కనిపిస్తున్న కొండూరు వెంకటేశ్వర్లు అనే మత్స్యకారుడుది వాకాడు మండలం తూపిలిపాళెం గ్రామం . తాతల తరాల నుంచి సంక్రమించిన చేపల వేట వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఐతే తమ గ్రామంలో మత్స్యకారులు ఎక్కువగా.. బోట్లు తక్కువగా ఉండడంతో పనులు లేక తమిళనాడులోనని హార్బర్‌కి వలస వెళ్లిపోయాడు. అక్కడ 15 ఏళ్లగా వేట సాగిస్తూ తన కుటుంబాన్ని పోషించే వాడు. జగనన్న ప్రభుత్వం అందించిన రాయితీలతో వలస బతుకును విడిచిపెట్టేశాడు. స్వగ్రామంలోనే నివసిస్తూ సముద్రంలో వేట చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

మత్స్యకారులు అనంత సాగరంలో చేపల వేట సాగిస్తుంటారు.. పొట్ట పోసుకునేందుకు ప్రాణాలకే తెగిస్తుంటారు. కల్లోల కడలిని జయించేందుకు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతుంటారు. అయితే గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వృత్తి నిర్వహణలో వెనుకంజ వేశారు. ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారు. స్వగ్రామంలో కుటుంబాలను విడిచిపెట్టి ఒంటరిగా బతుకుతుండేవారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారం చేపట్టగానే పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. గంగపుత్రులకు భరోసా చేకూరింది. వివిధ సంక్షేమ పథకాలతో వలస జీవితాలకు చెక్ పడింది.



ఓడపాళెం వద్ద వేటకు వెళుతున్న మత్స్యకారులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా సమాచారం



మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- వలసలకు చెక్ పెట్టేలా సాయం
- స్వగ్రామంలోనే పొట్టపోసుకుంటున్న జాలర్లు
- పథకాలను సద్వినియోగం చేసుకుంటూ జీవనం

వాకాడు : మత్స్యకారులు తమ కుల వృత్తినే దైవంగా భావించి కడలిపై బతుకు సాగిస్తున్నారు. ఐతే గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఇక్కడి మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వలసలు పోయేవారు. వేట తప్ప మరేపని తెలియని గంగపుత్రులు తమ భార్య, పిల్లలను సైతం ఇంటి వద్దనే వదిలేసి నెలల తరబడి వందల కిలోమీటర్లు దూరంలో ఉన్న తమిళనాడులో బతుకేవారు. అక్కడ ఇచ్చే అరకొర కూలీలతో పొట్టపోసుకునేవారు. ఏడాదిలో 8 నెలలు అంటే ఆగస్టు నుంచి మార్చి వరకు అక్కడే గడిపేవారు. అయితూ 2019లో కొత్తగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో వారి కష్టాలు తీరిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో వారి బతుకుకు భరోసా వచ్చింది. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. వేటకు సంబంధించి వివిధ రకాల పనిముట్లపై రాయితీలు, డీజిల్ సబ్సిడీ, మత్స్యకారులకు రూ. 10 వేలు భరోసా, రాష్ట్రంలో హార్బర్లు, పోర్టుల నిర్మాణాలు చేపట్టటింది. ఇకపై మత్స్యకారులు ఎక్కడెక్కడికో వలసలు పోవాల్సిన పనిలేకుండా సొంత ఊర్లోనే లాభదాయకమైన వేట సాగించుకునే అవకాశం కల్పించింది. ఈ క్రమంలోనే తాజాగా చేపల వేటను ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి 75 శాతం రాయితీతో బోట్లు, వలలు మంజూరు చేస్తోంది. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని వలస మత్స్యకారులు సరిహద్దు దాటకుండా సొంత గ్రామాలలోనే వేట చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.



తూపిలిపాళెం వద్ద బోటును సముద్రంలోకి తీసుకెళుతూ..



మత్స్య సంపదతో జాలర్లు

పూర్తి సహకారం



"సముద్రంపై చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న సంప్రదాయ మత్స్యకారులను ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలతో ఆదుకుంటోంది. రాయితీలపై వేట సామగ్రిని అందజేస్తోంది. మత్స్యకార భరోసా కింద రూ.10 వేలను సకాలంలో వారి ఖాతాలో జమ చేస్తోంది. అలాగే ప్రమాద బీమాను సైతం రెట్టింపు చేసింది. చేపల ఉత్పత్తిని పెంచుకునేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తోంది.

– రాజేష్, ఏడీ, మత్స్యశాఖ

బీజేపీ నేత వ్యాఖ్యలను ఖండించి ఈఓ

తిరుమల: పార్వేట మండపం, అలిపిరి పాదాల మండపం వద్ద గల విశ్రాంతి మండపాల పునర్నిర్మాణానికి సంబంధించి బీజేపీ నేత భాను ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను టీటీడీ ఈఓ ఏవీ. ధర్మారెడ్డి ఖండించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్వేట మండపం స్థానంలో కళాఖండాలను యథాతథంగా ఏర్పాటు చేసి నూతన మండపాన్ని పునర్నిర్మించామన్నారు. అయితే సదరు బీజేపీ నేత పాత మండపమే బాగుందని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. ఈ విషయానికి సంబంధించి ఆయన నేరుగా వస్తే పాత మండపం ఫొటోలను, నూతన మండపాన్ని పరిశీలించి ఏది బాగుందో మీడియా సమక్షంలో స్పష్టం చేస్తామని తెలియజేశారు. అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న విశ్రాంతి మండపం మరమ్మతులకు ఆస్కారం లేని విధంగా శిథిలావస్థకు చేరుకుందని ఈఓ చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు మండపాన్ని పరిశీలించి పునరుద్ధరించాలని ఇచ్చిన నివేదిక మేరకు జీర్ణోద్ధరణ చేస్తున్నామన్నారు. ఈ రెండు మండపాలు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో లేవని, వీటి పునరుద్ధరణకు పురావస్తు శాఖ అనుమతులు అవసరం లేదని స్పష్టం చేశారు.

లింగ నిర్ధారణ పరీక్ష చేస్తే కేసులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు తప్పవని కలెక్టర్ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అములుపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రుల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పిండం, తల్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు మాత్రమే స్కానింగ్ పరికరాలు వాడాల్సి ఉంటుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్ష చేసిన వారికి రూ.50 వేల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందని వెల్లడించారు. అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు, స్ట్రింగ్ ఆపరేషన్, డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. సమావేశంలో డీఎస్పీ కాటమరాజు, డీపీఎంఓ శ్రీనివాస్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంత కుమారి, లీగల్ అడ్వైజర్ ఇంద్రాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధికి 'రహదారి'

- తిరుపతిలో సువిశాలంగా కొత్త రోడ్లు
- మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఆధునిక హంగులు
- రూ.10.98 కోట్లతో మరో రెండు రహదారులు
- త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు



రాణి పరాంతకాదేవి మార్గం



అనంతాళ్వార్ రోడ్డు

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక నగరిలో రోడ్లకు మహర్దశ వచ్చింది. విస్తరణ, అభివృద్ధి కొంత భాగానికే పరిమితం కావడం వల్ల గతంలో నగరంపై ఒత్తిడి పెరిగింది. ట్రాఫిక్ ఇక్కట్లు, సరైన కనెక్టివిటీ లేకపోవడం శాపంగా మారింది. ఈ లోపాలను గుర్తించిన పాలకులు వాటిని అధిగమించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఆలోచనలతో మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కనెక్టివిటీ, విస్తరణే లక్ష్యంగా 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తుండగా.. వాటిలో ఇప్పటికే 11 రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. మరో ఆరు రోడ్లు దాదాపు పూర్తి కావచ్చాయి. మరో రెండు రోడ్లను త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

నగర విస్తరణే లక్ష్యం..

నగర తూర్పు ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండేది. ఇందుకు ప్రధాన కారణం సరైన రోడ్లు లేకపోవడమే. దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో భవన నిర్మాణాలకు అడుగులు పడలేదు. చిన్నపాటి వర్షం పడిన ఆయా ప్రాంతాలు బురదమయంగా మారిపోయేవి. దీంతో అక్కడ భూములకు ఏమాత్రం విలువ లేకపోగా ఇల్లు కట్టుకునే సాహసం కూడా ఎవరూ చేయలేకపోయారు. దీనిపై దృష్టి సారించిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మరో 5 ఎకరాల్లో నగర విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించేందుకు కనెక్టివిటీ కోసం ఏకకాలంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి నడుం బిగించారు. ఏడాది కాలంలోనే ఇప్పటికే 11 రోడ్లు నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో మరో రెండు రహదారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. రోడ్లతోపాటు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు. వర్షపు నీరును నగరం దాటించేలా పెద్ద కాలువలను సైతం నిర్మించారు. రేణిగుంట రోడ్డు హీరో హోండా షోరూం నుంచి పద్మావతిపురం హైస్కూల్ వరకు విశాలమైన రహదారిని నిర్మించారు. ఈ నూతన రోడ్డుకు రాణి పరాంతకాదేవి పేరును ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రతిపాదనతో నామకరణం చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి రూ.8.31 కోట్లు ఖర్చు చేశారు .అలాగే రేణిగుంట రోడ్డు అంకుర హాస్పిటల్ నుంచి 0.7 కిలోమీటర్ల పొడవుతో అందమైన రహదారిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందుకోసం రూ.2.67 కోట్లు వెచ్చించారు. ఈ రహదారికి అనంతార్వాళ్ పేరు పెట్టారు. ఈ రోడ్లకి ఇరువైపులా మురుగు కాలువలు, సెంటర్ డివైడర్, మోడ్రన్ లైటింగ్ సిస్టమ్, గ్రీనరీని విస్తృతంగా అభివృద్ధి చేశారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల సమాచారం

రూపకర్త :	భూమన అభినయ్
మొత్తం రహదారులు :	18
అందుబాటులోకి వచ్చినవి :	11
కొత్తగా ప్రారంభించనున్నవి :	02
ఆయా మార్గాల పేర్లు:	రాణి పరాంతకాదేవి, అనంతార్వాళ్

ట్రాఫిక్ కష్టాలకు చెక్

రేణిగుంట రోడ్డు నుంచి శ్రీనివాస కళ్యాణ మండపం , మార్కెట్ యార్డ్‌కు వెళ్లాలంటే రామానుజ కూడలి, లక్ష్మీపురం కూడలి మీదుగా వెళ్లేందుకు ఏకైక మార్గం ఉండేది. వందలాది వావాహనాలతో ఈ మార్గం నిత్యం ట్రాఫిక్ చక్రబంధంలో ఉండేది. మాస్టర్ ప్లాన్ రోడ్లతో ఆటోనగర్ నుంచి రెండు మార్గాలు, హీరో హోండా షోరూం నుంచి రాణి పరాంతకాదేవి మార్గం మీదుగా తిరుచానూరుకు, అలానే నేషనల్ హైవేకు చేరుకునే వెసులుబాటు వచ్చింది. రేణిగుంట రోడ్డు నుంచి మార్కెట్ యార్డ్‌కు వెళ్లేందుకు హీరో హోండా షోరూం నుంచి పద్మావతీపురం హైస్కూల్, పద్మావతీపురం మెయిన్ రోడ్డు మీదుగా తిరుచానూరు రోడ్డుకు పరాంతకాదేవి మార్గం ద్వారా సులభంగా రాకపోకలు సాగించవచ్చు. మొత్తం మూడు మార్గాల ద్వారా రేణిగుంట రోడ్డు- నేషనల్ హైవేను కలుపుతూ నిర్మించడంతో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడింది. నూతనంగా అభివృద్ధి చేసిన రహదారుల కిరువైపులా ఆ ప్రాంతంలో వందలాదిగా భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.

కనెక్టివిటీ పెరుగుతోంది



"డిప్యూటీ మేయర్‌గా ప్రజలు చిన్న అవకాశం ఇచ్చారు. దీన్ని 100 శాతం నగర అభివృద్ధికి వినియోగిస్తున్నా. మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణంతో తిరుపతికి కనెక్టివిటీ పెరిగింది. మరో 45 ఏళ్ల అవసరాలను గుర్తించి ఏకకాలంలో 18 రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. వాటితోపాటు లింక్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్ లు, ప్రధాన కూడళ్ల విస్తరణకు నడుం బిగించాం. దీంతో నయా తిరుపతి ఆవిష్కృతం అవుతోంది. – భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి

సర్వం సిద్ధం




తిరుపతిలో నూతనంగా నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లు రెండింటిని ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశాం. కొత్త రహదారులతో నగరానికి నూతన శోభ వచ్చింది. రాబోయే రోజుల్లో తిరునగరం మరింతగా అభివృద్ధి చెందేలా ప్రణాళికను అమలు చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ఆధునిక వసతులతో రోడ్లు నిర్మించాం.

– హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్.

డిసెంబర్ 17న భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి కల్చరల్: హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ విద్యాసంస్థలు, జిల్లాలోని ఇతర పాఠశాలల విద్యార్థులకు డిసెంబర్ 17న శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 9 గంటలకు భగవద్గీత 3వ అధ్యాయం కర్మ యోగంలో కంఠస్థ పోటీలు జరిపించనున్నారు. 6,7 తరగతుల విద్యార్థులకు, 8,9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగనున్నాయి. ఇందు కోసం ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రతిభ గల ఐదుగురు విద్యార్థుల వివరాలను డిసెంబర్ 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అన్నమాచార్య కళామందిరం లేదా హిందూ ధార్మిక సంస్థలైన శ్వేతలో సమర్పించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 9676615643 నంబర్‌లో సంప్రదించాలి. అలాగే భగవద్గీతలోని 700 శ్లోకాలు వచ్చిన 18 ఏళ్లలోపు వారికి ఒక విభాగం, 18 ఏళ్లు పైబడిన వారికి మరో విభాగం పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1000లు, రూ.750లు, రూ.500లు నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు.

తిరుపతి ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా పీసీ రాయులు



తిరుపతి కల్చరల్ : కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు తిరుపతి ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నామినేట్ చేసింది. ఈ కమిటీ ఎంపీ గురుమూర్తి అధ్యక్షతన విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేస్తుంది. పీసీ రాయులు మాట్లాడుతూ కేంద్ర పౌర విమాన యాన మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆనందం హక్కు

శెట్టిపల్లె వాసుల దశాబ్దాల పోరాటం ఫలించింది. తిరుపతి నగరంలో గత నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి జైత్రయాత్రలో మరో మైలు రాయి చేరింది. టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది. రైతులు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారికి హక్కులు కల్పిస్తూ గురువారం ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేశారు. 14 ఏళ్ల టీడీపీ ప్రభుత్వం చేయలేని పని కేవలం నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 75 ఏళ్ల నాటి సమస్య పరిష్కారం
- శెట్టిపల్లె వాసులకు ఆస్తులపై హక్కులు
- ఐటీ హబ్‌గా రూపాంతరం చెందనున్న గ్రామం
- 'భూమన' కృషి ఫలితం
- రైతులు, ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ప్రొసీడింగ్స్ పంపిణీ
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు


భూ హక్కుపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషా, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి తదితరులు (ఫైల్)

సాక్షి, తిరుపతి : స్వాతంత్ర్యానంతరం ప్రతి గ్రామంలోని వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను సర్వే చేసి అనుభవ దారులకు ప్రభుత్వం సెటిల్ మెంట్ హక్కులు కల్పించింది. శెట్టిపల్లె వాసులకు మాత్రం ఈ చట్టం అమలు కాలేదు. తమ భూములపై చట్ట బద్ధ హక్కుల కోసం 75 ఏళ్ల నుంచి వారు పోరాటం సాగిస్తున్నారు. ఇన్నేళ్ల వారి కల నెరవేరింది. సుమారు 2 వేల కుటుంబాలకు చెందిన భూములపై అధికారిక హక్కులు కల్పించింది. తిరుపతి నగరానికి అతిసమీపంలోని శెట్టిపల్లెలో 636.38 ఎకరాల వ్యవసాయ, నివాస భూములు ఉన్నాయి. అనుభవంలో ఉన్న ఆ భూములపై వీరికి ఎలాంటి హక్కులు లేవు. హక్కుల కోసం ఇప్పటి తరం వారి తాతలు, తండ్రులు పోరాటం చేశారు. ఎందరో అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగారు. చూస్తాం అని కంటి తుడుపు మాటలు చెప్పిన వారెవరూ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయలేక పోయారు. కనీసం సమస్య లోతు పాతులు అర్థం చేసుకునే తీరిక కూడా చేసుకోలేక పోయారు . సీపీఎం నేతలు కూడా 16 ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తూనే వచ్చారు.

హామీ ఇచ్చారు.. చేసి చూపించారు

దశాబ్దాలుగా నలుగుతున్న తమ సమస్యను పరిష్కరించాలని శెట్టిపల్లె వాసులు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి విన్నవించగా ఆయన హామీ ఇచ్చారు. వరదల సమయంలో తిరుపతిలో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి శెట్టిపల్లె సమస్యను తీసుకెళ్లారు. సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారు. సమస్యను పరిష్కరిస్తానని శెట్టిపల్లె వాసులకు మాట ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ప్రభుత్వ స్థాయిలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఫైళ్లను పరిగెత్తిస్తే, క్షేత్ర స్థాయిలో ఉన్న లెక్కలేనన్ని చిక్కుముడులను విప్పేందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి రంగం లోకి దిగారు. గ్రామస్తులందరినీ ఒక తాటిపైకి తేవడానికి లెక్కలేనన్ని సార్లు సమావేశాలు నిర్వహించారు. అప్పటికే పోరాటంలో ఉన్న సీపీఎం నాయకులు కందారపు మురళి, తదితరులతో అంశాల వారీగా చర్చించారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొని కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, రెవెన్యూ, ఇతర అధికారులతో సమీక్షించారు.

శెట్టిపల్లె పంచాయతీని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయించి సమస్య పరిష్కారానికి మొదటి మార్గం సిద్ధం చేశారు. సుమారు ఏడాది పాటు కలసికట్టుగా పనిచేసి సమస్యకు పరిష్కారం చూపించారు. గురువారం ఈ మేరకు శెట్టిపల్లెకు జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని మొత్తం రప్పించారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించి భూములు, ఇంటి స్థలాల పై హక్కులు కల్పిస్తూ అధికారిక పత్రాలు ఇప్పించారు. ఈ సమస్య పరిష్కారంలో సీపీఎం నాయకుడు కందారపు మురళి చొరవను కూడా ప్రత్యేకంగా చెప్పాల్సిందే. రాజకీయాలు పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులు చేస్తున్న జన ప్రయోజన కార్యక్రమానికి బాధితులను సమన్వయం చేశారు.

మారనున్న రూపురేఖలు

మంగళం సమీపంలోని శెట్టిపల్లెను ఐటీ హబ్‌గా తయారు చేయడానికి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి , డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో పాటు రూ.3 కోట్లతో గ్రామాభివృద్ధికి పనులు ప్రారంభించారు. శెట్టిపల్లెవాసులు ఎన్నడూ ఊహించని విధంగా తెలుగుగంగ నీటిని సరఫరా చేయడానికి కార్యాచరణ రూపొందించారు. తిరుపతి నగరానికి నేరుగా రవాణా ఉండేలా ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా మాస్టర్ ప్లాన్ రోడ్డును మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే శెట్టిపల్లె భూముల్లో బంగారం పండినట్లే. భూముల విలువ అమాంతం పెరిగి చాలా మంది కోటీశ్వరులుగా మారనున్నారు.

75 ఏళ్ల సమస్యకు పరిష్కారం


గత 75ఏళ్లుగా శెట్టిపల్లి రైతులు, ఇరవయ్యేళ్లుగా శెట్టిపల్లి భూములలో ప్లాట్లు కొనుగోలు చేసి ఆ భూములపై హక్కులేక నానా అవస్థలు పడ్డారు. ఈ భూ సమస్య పరిష్కారం కోసం తిరగని రాజకీయ పార్టీ నాయకులు లేరు. తిరగని ప్రభుత్వ కార్యాలయాలు లేవు. చివరకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిసి శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చేయాలని కోరాం. వెంటనే భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. దశాబ్దాల శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించిన దేవుళ్లు కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి. భూ సమస్య పరిష్కారంతో వేల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారు.

- రాధాకృష్ణ, శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ నాయకుడు

పేద కుటుంబాల్లో వెలుగులు నింపారు


కూలీనాలి చేసుకుని పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లుపై హక్కు లేదని గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చి తమ లాంటి వేలాది మంది పేదల కుటుంబాలను రోడ్డున పడేశారు. సంపాదించిన డబ్బులు పోయి, కొనుగోలు చేసిన ప్లాట్లు పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డాం. పేదలకు కష్టమొస్తే మీకు అండగా ఉన్నామని శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం రాత్రింబవళ్లు శ్రమించి ఏళ్ల నాటి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూసి వేల పేద కుటుంబాల్లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి వెలుగులు నింపారు.

- వీరభద్రయ్య, ప్లాట్లు కొనుగోలుదారుడు

శాశ్వత పరిష్కారం లభించడం సంతోషం


శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం మా తాత ముత్తాల నుంచి పోరాడుతూనే ఉన్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఓటు రాజకీయం చేయడం తప్ప మా సమస్యకు పరిష్కారం చూపలేదు. శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరిస్తే ఓట్లు వస్తాయా, ఆదాయం వస్తుందా అని చూడకుండా పేదల సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వచ్చి 75 ఏళ్ల నాటి శెట్టిపల్లి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన గొప్ప మనసున్న నాయకులు భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి. మేము బతికుండగా పరిష్కారం అవుతుందో లేదో అనుకున్నాం. సీఎం జగనన్న సహకారం, భూమన కుటుంబం కృషితో శెట్టిపల్లి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉంది.

- బత్తినబాబు, శెట్టిపల్లి రైతు

క్లుప్తంగా

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి


అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ రవీంద్రబాబు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని హైకోర్టు జడ్జి జస్టిస్ రవీంద్రబాబు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అండర్-14 తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం అండర్-14 తైక్వాండో బాలురు, బాలికల విభాగం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి ఒలింపిక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎలమంచిలి ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్, స్కూల్ గర్ల్స్ కార్యదర్శి విజయకుమారి, బాబు, తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి విజయకుమార్, గోపీనాయుడు, రూపేంద్ర రెడ్డి హాజరయ్యారు. ప్రవీణ్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ కారణంగా శరీరంతోపాటు మానసిక దృఢత్వం చేకూరుతుందన్నారు. విజేతలు రైల్వే కోడూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

దళారుల మాటలు నమ్మకండి

- ఆంజనేయులునాయక్ పేరుతో డబ్బులు వసూలు
- సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి


ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖ ఉద్యోగినని చెబుతూ బి.ఆంజనేయులు నాయక్ పలువురుని మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సమగ్రశిక్ష శాఖ పరిధిలోని సీఆర్‌పీ పోస్టులను భర్తీ చేస్తున్నారు, డబ్బులిస్తే ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసానికి పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి ఈమేరకు పలువురు ఫిర్యాదులు చేశారని చెప్పారు. బి.ఆంజనేయులు నాయక్ అనే వ్యక్తి తమ శాఖలో పనిచేయడం లేదన్నారు. నిబంధనల మేరకే ఏ పోస్టునైనా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. మాయ మాటలు చెప్పి దగా చేసే మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. ఇలాంటి మోసాలకు ఎవరైనా పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏపీసీ హెచ్చరించారు.

త్వరలో గోవింద కోటి పుస్తకాలు

- డయల్ యువర్ ఈవోలో ఏవీ ధర్మారెడ్డి


మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: గోవిందకోటి పుస్తకాలను టీటీడీ ముద్రిస్తోందని, త్వరలో ఆన్‌లైన్‌తో పాటు టీటీడీ కల్యాణ మండపాలు, సమాచార కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానాలు ఇచ్చారు.

శ్రీనివాస్ – విశాఖ – పరకామణి సేవకులకు కూడా లక్కీ డిప్‌లో ఆలయ డ్యూటీలు ఇవ్వండి.

ఈవో: పరకామణి సేవ ముగిసిన తర్వాత ఆలయ విధులు కేటాయించేందుకు ప్రయత్నిస్తాం.

– సూరిబాబు – హైదరాబాద్, బాలాజీ–వరంగల్, రామ్మోహన్– తాడేపల్లి – దర్శనం టికెట్ బుక్ చేసుకున్నాం. అడ్వాన్స్ బుకింగ్‌లో గది దొరకలేదు.

ఈవో: తిరుమలలో 7 వేల గదులు మాత్రమే ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్‌లో గదులు లభించని భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి సీఆర్‌ఓలో నమోదు చేసుకుని కొంత సేపు వేచి ఉండి గదులు పొందవచ్చు. లేనిపక్షంలో తిరుపతిలో కూడా గదులు పొందే అవకాశం ఉంది.

– వెంకటరమణ – నెల్లూరు– వైకుంఠ ఏకాదశి 10 రోజుల్లో లాకర్లు కూడా దొరకడం లేదు.

ఈవో: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజుల్లో భక్తులు ఎవరికి వారు ఆలోచించి 24 గంటల తర్వాత గదులను గానీ, లాకర్లను గానీ ఖాళీ చేసి ఇతర భక్తులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం.

– నిహారిక – కృష్ణాజిల్లా – దాతలు వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు బుక్ చేసుకోవచ్చా?

ఈవో: దాతలు పది రోజుల్లో ఏదోఒకరోజు వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

– మోహన్ కృష్ణ – కడప – గోవింద కోటి పుస్తకాలను టీటీడీ ముద్రించి నామమాత్రపు ధరకు అందించండి. శ్రీవారి ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను 90 రోజులు ముందు కాకుండా 30 రోజులు ముందు ఆన్‌లైన్‌లో విడుదల చేయండి.

ఈవో : గోవింద కోటి పుస్తకాలను టీటీడీ ముద్రిస్తోంది. త్వరలో ఆన్‌లైన్‌తోపాటు టీటీడీ కల్యాణ మండపాలు, సమాచార కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. ఎక్కువ మంది భక్తుల కోరిక మేరకే మూడు నెలల ముందుగా ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు విడుదల చేస్తున్నాం.

– రఘు – అనంతపురం – మా ఊరిలో టీటీడీ కల్యాణ మండపం పక్కనే ఉన్న స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించండి.

ఈవో: స్థల పరిశీలన చేసి అవసరం ఉన్న పక్షంలో శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా శ్రీవారి ఆలయం నిర్మించేందుకు ప్రయత్నిస్తాం.

–శంకర్ – హైదరాబాద్ నా వద్ద మొత్తం రూ.10 లక్షల విలువ చేసే విరాళాల రశీదులు నాలుగున్నాయి. ఆ మేరకు ప్రయోజనాలు వర్తిస్తాయా.

ఈవో : దాతలు విరాళం అందించిన తర్వాత ప్రయోజనాలు పొందకుండా ఉన్నట్లయితే రశీదులన్నీ కలిపి ఒకే విరాళంగా పరిగణించి కొత్త ప్రయోజనాలు వర్తింప చేస్తాం.

– అశ్వంత్ రెడ్డి – హైదరాబాద్ – ఎస్వీబీసీ ద్వారా ధార్మిక ప్రవచనాలు చాలా చక్కగా వింటున్నాం. వీటిని విద్యార్థులకు చేరువ చేయండి.


ఈవో: భగవద్గీత సారాంశాన్ని విద్యార్థులకు అందించాలని ఇటీవల బోర్డు సమావేశంలో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నిర్ణయించారు.

శ్రీసిటీని సందర్శించిన ఎలక్ట్రానిక్స్ ఏజెన్సీ గ్రూప్ సీఈవో


శ్రీసిటీ నమూనాను పరిశీలిస్తున్న ఏపీఈఐటీఏ గ్రూప్ సీఈవో కిరణ్

వరదయ్యపాళెం: ఏపీ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపీఈఐటీఏ) గ్రూప్ సీఈవో కిరణ్ సలికిరెడ్డి తమ అధికారులతో కలిసి శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు స్వాగతం పలికి, సెజ్, డీటీజెడ్, వేర్ హౌసింగ్ జోన్ (ఎఫ్‌టీడబ్ల్యూజెడ్), ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లతో శ్రీసిటీ పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్ పనితీరు, అక్కడ పరిశ్రమల గురించి కిరణ్ ఆరా తీశారు. శ్రీసిటీ అధికారులతో చర్చల అనంతరం ఆయన పారిశ్రామికవాడ పరిసరాలను వీక్షించారు. బ్లూస్టార్, డైకిన్ ఇండియా పరిశ్రమలను సందర్శించి, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను చర్చించారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కిరణ్, భారీ ఉపాధి అవకాశాల సృష్టితో మెగా ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు.

డేటా విశ్లేషణలో మెరుగైన ఉపాధి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి సిటీ : డేటా అనాలసిస్, డేటా ఇంజినీరింగ్‌లో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని అమెరికా క్వా ఎగ్జిమా సీఈఓ గోవిందు బాలు తెలిపారు. శుక్రవారం తిరుపతి ఎస్వీయూ టెన్నిస్ హాల్‌లో నిర్వహించిన ఒక్క రోజు సదస్సులో ఆయన మాట్లాడుతూ డేటా సైన్స్‌లో విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు, కుమారకన్నం, రూసీ సీఈఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆనంద టెక్స్‌టైల్స్ ప్రారంభం


టెక్స్‌టైల్స్ ప్రారంభోత్సవంలో సినీ నటి కామ్న జఠ్మలాని, మేయర్ శిరీష

- సినీ నటి కామ్న జఠ్మలానీ సందడి

తిరుపతి కల్చరల్: గాంధీరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆనంద టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్ షోరూంను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ సినీనటి కామ్న జఠ్మలానీ, ముఖ్య అతిథులుగా మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, కార్పొరేటర్ పొన్నాల చంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా సినీనటి కామ్న జఠ్మలానీ మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆనంద టెక్స్‌టైల్స్ వారు శ్రీవారి పాదాల చెంత తిరుపతిలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. షోరూం అధినేతలు ఇలయ వర్ధన్, సుధ మాట్లాడుతూ ఇప్పటికే చిత్తూరులో తమ షోరూం ద్వారా సరసమైన ధరల్లో అధునాతన వస్త్రాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందామని తెలిపారు. ప్రతి రూ1000 కొనుగోలుపై కూపన్ అందించి, దీపావళి నాడు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందిస్తామన్నారు. ప్రథమ బహుమతులుగా రెండు స్కూటీలు, ద్వితీయ బహుమతులుగా మూడు బంగారు రింగులు, తృతీయ బహుమతులుగా ఐదుగురికి గోల్డ్ కాయిన్స్ అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే 10 స్మార్ట్ టీవీలు, 20 స్మార్ట్ ఫోన్లు, 30 ప్రెజర్ కుక్కర్లు విజేతలకు అందిస్తామన్నారు.

ముక్కంటి సేవలో ఎథిక్స్ కమిటీ చైర్మన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాష్ట్ర ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయదక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఎథిక్స్ కమిటీ చైర్మన్ మురుగుడు హనుమంతరావు

కిసాన్ రుణం 'అమూల్'యం

- లబ్ధిదారులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు
- ఒక్కో కార్డుపై లక్ష వరకు రుణాలు
- జిల్లాలో 1150 మందికి రూ.3 కోట్ల రుణాలు
- 94.80 శాతం జిల్లా రాష్ట్రంలోనే ముందంజ


ఆవు నుంచి పాలు పితుకుతున్న పాడి రైతు


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అమూల్ అధికారులు (ఫైల్)

తిరుపతి అర్బన్: అన్ని రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అందులో అమూల్ పాల సేకరణలో జిల్లా ముందు వరుసలో నిలుస్తోంది. 94.80 శాతం పాల సేకరణలో ప్రగతి సాధించడంతో రాష్ట్రంలో తిరుపతి ముందు వరుసలో నిలుస్తోంది. అమూల్ పాలసేకరణలో భాగంగా జగనన్న పాలవెల్లువ పేరుతో జిల్లాలో పుత్తూరు, వడమాలపేట, నారాయణవనానికి చెందిన మూడు మండలాల్లో ఈ కార్యక్రమానికి 10 నెలల క్రితం శ్రీకారం చుట్టారు. మంచి ఫలితాలు వస్తే జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని భావించారు. ఈ క్రమంలో ఉత్తమ ఫలితాలు రావడంతో త్వరలో 5 మండలాల్లో అమూల్ పాలసేకరణ చేపట్టడానికి శరవేగంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, పాకాల, చంద్రగిరి, ఎర్రావారిపాళెం మండలాల్లోనూ ఏర్పాటు చేయనున్నారు. మరో వైపు లబ్ధిదారులకు జిల్లాలో 6 వేల మందికి పశుకిసాన్ క్రెడిట్ కార్డులను అందిస్తూ పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నారు.

అమూల్ పాల సేకరణ ఇలా...

జిల్లాలో వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం మండలాల్లోని 79 గ్రామాల్లో పాలసేకరణకు శ్రీకారం చుట్టారు. పాలను అందించడానికి ఒక్కొక్కరుగా ఇప్పటికే 4,929 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అందులో 1,608 పాడి రైతులు రోజు 11,977 లీటర్ల పాలు సరఫరా చేస్తున్నారు. 1119 మంది రైతులకు డీసీసీబీ ద్వారా రూ.9.42 కోట్లు రుణాలు అందించారు. దీంతో జిల్లాకు 12,640 లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. అందులో 94.80 శాతం ప్రగతి చూపుతున్నారు. నవంబర్ నుంచి 100శాతం పాలసేకరణకు సిద్ధం అవుతున్నారు. 29 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పరిధిలో 79 చోట్ల పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు రూట్లలో పాలసేకరణ కోసం 7 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక వెటర్నరీ డాక్టర్‌తోపాటు మరో ఏడుగురు సిబ్బంది నాణ్యమైన పాల ఉత్పత్తుల సేకరణకు పాడి రైతులకు సరైన సూచనలు ఇవ్వడంతోపాటు అవగాహన కల్పిస్తుంటారు. ప్రభుత్వ పాలశీతలీకరణ కేంద్రాలకు సంబంధించిన భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. అవి పూర్తి చేస్తే వాటిని వినియోగించనున్నారు. ఆవు పాలకు రూ.28 ప్రైవేటు మార్కెట్‌లో రేటు ఉంటే అమూల్ పాల సేకరణ ద్వారా ప్రభుత్వం రూ.40, గేదె పాలకు ప్రైవేటుగా లీటరుకు రూ.60 ఇస్తుంటే, జగనన్న పాలవెల్లువ ద్వారా రూ.75 చెల్లిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 2 లక్షల లీటర్ల పాల సేకరణ కొనసాగుతుంది. డీసీసీబీ అధికారులు, ఉద్యోగులతోపాటు పశువైద్యాధికారుల విభాగం, డీఆర్‌డీఏ వారు సమష్టిగా పాల సేకరణకు కృషి చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి


జగనన్న పాలవెల్లువ పేరుతో అమూల్ పాల సేకరణ కేంద్రాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. క్రమేణి పాల ధరలను కొవ్వు శాతాన్ని బట్టి పెంచుతున్నాం. ఇతర ప్రైవేటు వారి కంటే అధిక ధరలు ఇస్తున్నాం . సహకార బ్యాంకు నుంచి ఇప్పటికే 1119 మంది పాడి రైతులకు రూ.9.42కోట్లు రుణాలు ఇచ్చాం. మరింత మందికి రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం మూడు మండలాల్లో కొనసాగుతుంది. త్వరలో మరో 5 మండలాల్లో కొనసాగించడానికి రంగం సిద్ధం చేస్తున్నాం.

-శ్రీనివాసులురెడ్డి, జిల్లా సహకార అధికారి

6 వేల పశుకిసాన్ కార్డులు


జిల్లాలో ఆరువేల మందికి పశుకిసాన్ కార్డులను పంపిణీ చేశారు. ఆ మేరకు రూ.లక్ష వరకు వారికి వివిధ బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నారు. ఇప్పటికే 1150 మందికి రూ.3కోట్లు రుణాలు ఇచ్చారు. అమూల్ పాల ఉత్పత్తులను పెంచడానికి ప్రత్యేక దృష్టి పెట్టాం. పాడి పశువులతోపాటు ఇతర పశువులకు చిన్నపాటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వాటికి పరిష్కారం చూపుతున్నాం. బ్యాంకు నుంచి పాల రైతులు ఎన్ని సార్లు అయినా రుణాలు తీసుకునే అవకాశం కల్పించారు. వారి అవసరాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు పొందవచ్చును. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- రవికుమార్, జిల్లా పశువైద్యాధికారి

క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకం, కల్లూరు, శ్రీధనమల్లి, సింగనాలత్తూరు గ్రామాల్లోని ఉపాధి పనులు ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామయ్య శుక్రవారం పరిశీలించారు. ఉపాధి పనులను పరిశీలించి, పనుల తీరును తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

మహాసభకు తరలిరండి

గూడూరురూరల్: హైదరాబాద్‌లో ఈనెల 11వ తేదీన జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు గూడూరు నియోజకవర్గం నుంచి వేలాదిగా మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సిసింద్రీ మాదిగ కోరారు. శుక్రవారం గూడూరు మండలంలోని పుట్టంరాజువారి కండ్రిగ, గొల్లపల్లెలో కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం చేశారు. కార్యక్రమంలో చిల్లకూరు మండల ఇన్‌చార్జి ఎం మల్లికార్జున, నాయకులు హరిబాబు, జీ శ్రీను, సుబరాయ్య, రమణయ్య, శ్రీకాంత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వేమాలమ్మకు పొంగళ్లు



పొంగళ్ల సామగ్రి ఊరేగింపు

ఓజిలి: మండలంలోని బట్లకనుపూరులో గ్రామదేవత వేమాలమ్మకు గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టారు. మేళ తాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామస్తులంతా కలసి పొంగళ్ల సామగ్రిని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. గ్రామంలో పంటలు సంవృద్ధిగా పండాలని, గ్రామస్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఏటా అమ్మవారికి పొంగళ్లు పెడతామని గ్రామస్తులు తెలిపారు.

కండలేరులో 11.339 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.339 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బిందు సేద్యం లాభదాయకం



బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

దక్కిలి: బిందు సేద్యం లాభాదాయకమని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్‌రేట్ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్(ఏపీఎంఐపీ) జిల్లా పీడీ సతీష్‌తో కలిసి శుక్రవారం ఆయన మండలంలోని వెంబులూరు, నాయుడుపాళెం గ్రామాల్లో బిందు సేద్యం పరికరాలు అమర్చిన పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంట సాగుకు బిందు సేద్యం సరైన మార్గమన్నారు. బిందు సేద్యం పరికరాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సిబ్బంది వెంకటేశ్వర్లు, సంధ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఊనుగుంటపాళేనికి చెందిన డీ కోటయ్య సౌజన్యంతో పేదలకు అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏ రమణయ్య, ఏ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఓటుహక్కు కల్పించండి



చిల్లకూరు: మాట్లాడుతున్న గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: వచ్చే జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించేలా బూత్ లెవల్ అధికారులు చొరవ చూపాలని గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించి, శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫారం -6 పూర్తి చేసినవి వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. చనిపోయిన, గ్రామంలో లేని వారి ఓట్లను వారి అంగీకారంతో తొలగించాలన్నారు. నవంబర్, డిసెంబర్‌లో మొదటి శని, ఆది వారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి ఓటు నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలు కీలకం

కోట: ఓటు నమోదులో బీఎల్వోల పాత్ర కీలమని, వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు. ఈ నెల 4,5 తేదీల్లో ప్రత్యేక ప్రచారం చేయాలన్నారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ, డీటీ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండండి

సూళ్లూరుపేట: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో బీఎల్వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కే రవికుమార్ తెలిపారు. ఫారం-6,7,8కి సంబంధించి వివరాలతో నమోదు చేసుకోవాలని కోరారు. ఒక వార్డు నుంచి మరో వార్డు, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి కూడా ఓటుహక్కు మార్పునకు అవకాశం ఉందన్నారు. అందరూ ఓటరు నమోదు చేసుకోవాలని, మార్పులు చేర్పులు చేసుకోవాలని కోరారు.

4,5 తేదీల్లో ప్రత్యేక ప్రచారం

గూడూరురూరల్ : ఈ నెల 4, 5 తేదీల్లో ఓటర్ల జాబితాను పరిశీలించుకునేందుకు ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఓటరు నమోదు అధికారి తహసీల్దార్ బాలలీలారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించిన ఓటర్లు తమకు ఓటు ఉందో, లేదో తెలుసుకోవడానికి, మార్పులు చేసుకోవడానికి సంబంధిత బీఎల్వోలు మండలంలోని 111 పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6ను హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గానీ, http://voters.eci.gov.in వెబ్‌సైట్ కూడా అందుబాటులో ఉందన్నారు. ఓటర్లు అందరూ ఈ వెబ్‌సైట్‌లో తమ పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని కోరారు. ఓటరుగా నమోదు అయిన వారు ఓటరు ఐడీ కార్డును ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గానీ, వెబ్‌సైట్‌లో గానీ డౌన్‌లోడ్ చేసుకుని, ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రత్యేక ఓటరు నమోదు

పెళ్లకూరు: వచ్చే జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటు నమోదు చేసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ రామయ్య తెలిపారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం-6, తొలగింపు కోసం ఫారం-7, సవరణలు, ఓటరును ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి బదిలీ కోసం ఫారం-8 దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 4, 5, వచ్చే నెల 2, 3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి బూత్‌స్థాయి అధికారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మీ ఇంటికే వచ్చాం.. సమస్యలుంటే చెప్పండి



సైదాపురం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: 'మీ ఇంటి వద్దకే వచ్చాం..సమస్యలేమైనా ఉంటే చెప్పండి. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కలిచేడు బస్టాండ్ సెంటర్ వడ్డిపాళెం, సినిమా హాల్ సెంటర్‌తోపాటు తురిమెర్ల పంచాయతీలోని పిల్లాగని కాలనీల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పేద సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.రవికుమార్, కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నేతలు ఎన్ రామ్‌గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ ఏ జయమ్మ, జీ వీరాస్వామి, ఎం వీరాస్వామి, బాబు, మునిరత్నం, సుబ్బారెడ్డి, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం ధ్యేయం.



వెంకటగిరి రూరల్: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులోని అమ్మవారిపేట, కాలేజీమిట్ట, సాయినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి ఆ ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ల వద్దకు ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పలువురు తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, వార్డు కౌన్సిలర్ ఎన్ శేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఏ శ్రీనివాసులు, వహిద, పార్టీ నాయకులు టీ మల్లికార్జున్, కుమార్, గణేష్‌రెడ్డి, కాటయ్య, ఆర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కులు పేదలకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘురెడ్డి

తడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు సర్వహక్కులు కల్పించేలా నిర్ణయం తీసుకోవడం పేదలకు వరమని ఎంపీపీ కే రఘురెడ్డి కొనియాడారు. ఎంపీడీఓ ఆమోసుబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ రఘురెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 2003 సంవత్సరానికి పూర్వం పేదలకు ప్రభుత్వం ద్వారా ఇచ్చిన అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా రెవెన్యూ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మూడు నెలలకొకసారి జరిగే సమావేశంలో మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాల్గొనాలని చెప్పారు. గత మూడు సమావేశాలుగా వెటర్నరీ శాఖకు సంబంధించి ఒక అధికారి కూడా పాల్గొనక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి కార్తీక్, డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, డీటీ శరత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ చేరిన చిల్లకూరు మట్టి



ఢిల్లీలో మట్టి వేస్తున్న నల్లయ్య

చిల్లకూరు: మేరా దేశ్- మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సేకరించిన మట్టి ఢిల్లీకి చేరింది. మండలంలోని అన్ని ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ర్యాలీలు చేసి, సేకరించిన మట్టిని నింపిన కుండను ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు బీ నల్లయ్య గత నెల 28వ తేదీన ఢిల్లీకి తీసుకువెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉంచిన కుండలో ఈ మట్టిని వేసి వచ్చినట్లు ఆయన శుక్రవారం తెలిపారు.

అధునాతన హంగులతో అంబేడ్కర్ భవన్



అంబేడ్కర్ భవన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ భవన్‌ను అధునాతన హంగులతో నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలసి అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీంచారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్‌లో గతంలో మాదిరిగా వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సకల సౌకర్యాలతో అంబేడ్కర్ భవన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ భవన్ మిద్దెపై కూడ కార్యాలు జరుపుకునేందుకు వీలుగా నిర్మాణ పనులు చేయాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే మాధవరెడ్డి, కే జయరామయ్య, బీ మల్లికార్జునరెడ్డి, కే రాజారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, పీ రాహుల్, రహమాతుల్లా పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కల్లూరులో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయధికారులు

దొరవారిసత్రం: మండలంలోని కొత్తపల్లె, పూలతోట, కల్లూరు గ్రామాల్లో సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఏడీఏ అనిత, స్థానిక ఏఓ జ్యోతిర్మయి శుక్రవారం పలు గ్రామాల్లో వరి, మిరప పంటలను పరిశీలించారు. గత రెండు, మూడు రోజుల నుంచి అరకొరగా కురుస్తున్న వానలకు ప్రస్తుతం సాగులో ఉన్న వరి, మిరపకు కొంతవరకు లాభం ఉందని ఏడీఏ రైతులకు తెలిపారు. వరిలో కలుపు ఎక్కువగా ఉందని, దాన్ని నివారించేందుకు పెనాక్సులామ్ (అసెర్ట్) 400 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణం శాఖ లెక్కల ప్రకారం మరో 4, 5 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏడీఏ చెప్పారు. వర్షాలు పడిన తరువాత పంటకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయ బావులు, బోర్లు కింద వరికి ప్రత్యామ్నాయంగా వేరుశనగ, పత్తి, పెసర, నువ్వులు తదితర పంటలు సాగు చేసుకోవాలని ఆమె సూచించారు.

సామర్థ్య సర్వే పరీక్ష

కోట: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల సర్వే కోసం ఎంపిక చేసిన ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఈఏఎస్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ఎంపిక చేసిన 27 పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించామని ఎంఈఓ-2 మస్తానయ్య తెలిపారు.

అచీవ్‌మెంట్ పరీక్షల పరిశీలన



దక్కిలి: గురుకులంలో అచీవ్‌మెంట్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

దక్కిలి: మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ పరీక్షలను ఎంఈఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి పాల్గొన్నారు.

పవిత్రమైనది అయ్యప్ప దీక్ష

వెంకటగిరిరూరల్: నియమ, నిబద్ధతలతో చేసే అయ్యప్ప దీక్ష చాలా పవిత్రమైందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అయ్యప్పమాల ధరించిన భక్తులకు తన సొంత ఖర్చులతో భిక్ష(భోజన వసతి) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్ష అనేది ప్రతి మతంలో ఉందన్నారు. హిందువుల్లో అయ్యప్పస్వామి మాల ధరించడం, ముస్లింల్లో రంజాన్ మాస ఉపవాసం, క్రైస్తవులు లిక్కా పేరుతో 40 రోజుల పాటు ఎంతో నిబద్ధతతో దీక్షలు చేస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, నాయకులు టీ గణేష్ రెడ్డి, శ్రీధర్మ శాస్త్ర కమిటీ నిర్వాహకులు కృష్ణ, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్యకు నివాళి



జక్కా వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరురూరల్: మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య జయంతి సందర్భంగా గూడూరులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీనియర్ నాయకులు చంద్రయ్య ఆధ్వర్యంలో జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సీపీఎం ముఖ్య కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ అధ్యక్షుడు బీవీ రమణయ్య, పట్టణ కార్యదర్శి సురేష్, పీ మణి, కేవీపీఎస్ నాయకులు ప్రసాద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రుతురాగాన.. మురిపించిన వాన



సూళ్లూరుపేట గాంధీవీధిలో నిలిచిన వర్షపునీరు



కర్లపూడిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సూళ్లూరుపేట: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం పట్టణవాసికి హాయినిచ్చింది. పట్టణంలో పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. గాండ్ల వీధి, హిందూ శ్మశానవాటిక ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ప్రస్తుతం ఎల్లిపైరు సాగు చేసిన రైతులు, వరినాట్లు వేసుకునే రైతులకు ఈ వర్షం కొంత ఊరట నిచ్చింది. శుక్రవారం నుంచి ఆకాశమంతా మేఘావృతమై జల్లులు పడుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జలమయమైన రోడ్లు

కోట: మండలకేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యానగర్ ప్రకాశం కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో అన్నదాతలు సాగుకు సై అంటూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

పూర్తి స్థాయి సహకారం అందిస్తా

గూడూరురూరల్: నూతనంగా ఏర్పాటు చేయనున్న వైఎస్సార్ జగనన్న సేవా సమితికి తాను పూర్తిస్థాయి సహకారం అందిస్తామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పేదలకు తన వంతు సేవలు అందించడానికి వైఎస్సార్ జగనన్న సేవా సమితి ట్రస్టును ఏర్పాటు చేస్తున్నామని యూ మహేంద్రరెడ్డి తెలిపారు. ఈ క్రమంలో వెంకటగిరిలో నేదురుమల్లిని కలసి ట్రస్టు ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనిపై స్పందించిన నేదురుమల్లి మాట్లాడుతూ పూర్తిస్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ పెంచలరావు, ఎం పెంచలరాజు, ఈ వెంకయ్య, రఘురామరాజు, ఎం రవీంద్రరెడ్డి, బీ ధనుంజరెడ్డి, నిఖిల్ సాయి, రాజశేఖర్, తిరుపాలయ్య, మహేష్, చరణ్, అవినాస్ తదితరులు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ పంపిణీ పూర్తి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాటికి పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి చేసినట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4,214 పింఛన్లకుగాను 4 వేలకు పైగా పంపిణీ చేశామన్నారు. కొన్ని సచివాలయాలకు సంబంధించి అడ్మిన్లతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. భరత్‌నగర్ సచివాలయంలో పనిచేస్తున్న వలంటీర్ అల్లా సాదిక్ నెల్లూరులో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈగ సుబ్రహ్మణ్యంకు అక్కడికి వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

దక్కిలి: మండలంలోని డీ వడ్డిపల్లెకు చెందిన టీ గంగమ్మ అనారోగ్యంతో చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ చెంగల్‌రాయులు శుక్రవారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. గంగమ్మ కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



దక్కిలి: చెన్నైలోని ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

నాయుడుపేటటౌన్: బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి చెప్పారు. శుక్రవారం నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో సెక్షన్ 30 ఆఫ్ పోలీస్ యాక్టు అమలులో చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఇతర సంస్థలు, వివిధ గ్రూపుల వారు అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలకు ముందస్తుగా డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


నేడు సైదాపురం మండల మీట్

సైదాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పీ పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈడీఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

సైదాపురం: మండలంలోని తురిమెర్ల సచివాలయం పరిధిలోని శనివారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్ తెలిపారు.





వేలము నోటీసు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
డిప్యూటీ రిజిస్ట్రార్ / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ - నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (ప్రస్తుతం తిరుపతి జిల్లా), వాకాడు మండలము, వాకాడు నందలి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వాకాడు బ్రాంచి నందు ఈ క్రింద తెలుపబడిన బకాయిదారులు తమ కుటుంబ అవసరముల నిమిత్తం అప్పు తీసుకొని ఇంత వరకు పూర్తిగా చెల్లించనందున వారిపై బ్యాంక్ వారు డిక్రీ పొంది యున్నారు. సదరు డిక్రీ మొత్తమును రాబట్టుకొనుటకు గాను ఈ క్రింద చూపబడిన స్థిరాస్తులను సేల్ ఆఫీసరు, ఓ.ఆర్.&ఓ.యస్.డి వారి కార్యాలయము, నెల్లూరు వారిచే ఈ క్రింద తెలుపబడిన తేదిలలో బహిరంగముగా ఆయా ప్రదేశములలో వేలము వేయబడును. వేలము పాటకు సంబంధించిన ఇతర షరతులను బ్రాంచి మేనేజర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వాకాడు బ్రాంచి వాకాడు వారి వద్ద నుండి గాని లేక సేల్ ఆఫీసర్ / ఓయస్‌డి వారి కార్యాలయము జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ - గాంధీబొమ్మ వద్ద ట్రంక్ రోడ్డు నెల్లూరు వారి నుండి గాని పొందవచ్చును.

వరుస సంఖ్య	తీర్పు బకాయిదారుని పేరు, చిరునామా	అప్పు పిటీషన్ నెంబర్	రావలసిన బాకీ మొత్తం	వేలము వేయబడు ఆస్తి వివరాలు: సర్వే నెం.	విస్తీర్ణము(ఎ)	వేలము వేయబడు తేది మరియు సమయం	వేలము వేయబడు స్థలం
01	దువ్వూరు సుబ్బమ్మ భర్త లేట్ పుల్లారెడ్డి మల్లాం గ్రామం, చిట్టమూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా	105 / 2020-2021	రూ. 35,84,434 + వడ్డీ + ఇతర ఖర్చులు	312-2	7.58	08-11-2023వ తేదీ ఉదయం 11-00 గంటలకు	గ్రామ సచివాలయం మల్లాం గ్రామం చిట్టమూరు మండలం SPSRనెల్లూరు జిల్లా

సం/- యస్.వెంకటక్రిష్ణయ్య
అసిస్టెంట్ మేనేజర్ / సేల్ ఆఫీసర్, SPSR నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, నెల్లూరు. సెల్: 99495 35199